

ఆర్డీవో దశరథ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బస్తీ వాసులతో మర్రి శశిధర్‌రెడ్డి

అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలి

బేగంపేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గంలో పదేళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ, సీసీ నగర్, బండ మైసమ్మనగర్, న్యూ బోయిగూడ వాసులతో సికింద్రాబాద్ ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్‌లో పదేళ్ల క్రితం సుమారు 225 ఇళ్లను ప్రభుత్వం నిర్మించిందన్నారు. ఇప్పటి వరకు అర్హులైన వారికి కేటాయించక పోవడంతో కొందరు అక్రమార్కులు వాటిని కబ్జా చేయగా, మరి కొందరు నకిలీ పట్టాలతో ఇళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. బన్సీలాల్‌పేటలోని సీసీనగర్, బండమైసమ్మనగర్, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులకు కేటాయించాలని ఆర్డీఓను కోరినట్లు ఆయన తెలిపారు.



దుస్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

బంజారాహిల్స్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ ప్రియుల కోసం వన్ స్టాప్ సొల్యూషన్‌గా అన్ని వస్తువులనూ ఒకే వేదిక మీదకు తీసుకొస్తూ బంజారాహిల్స్ కళింగ కల్చరల్ హాల్‌లో హ్యాండ్ పేరిట ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలను ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి అమ్మకానికి ఉంచారు. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రవేశ ఉచితం అని, ఈ నెల 30వ తేదీతో ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలికి

యూకే ప్రభుత్వ సేవారత్న అవార్డు



డాక్టర్ హరి ఓమ్‌త్యాగి, పాల్ స్కలీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అనూహ్యారెడ్డి

బంజారాహిల్స్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కోవిద సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జి.అనూహ్యా రెడ్డికి యూకే ప్రభుత్వ సేవారత్న(జ్యూవెల్ ఆఫ్ సర్వీసు) అవార్డు లభించింది. సేవారంగంలో విశేషమైన సేవలందించినందుకు గత వారం లండన్ పార్లమెంట్ వేదికగా హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో వరల్డ్‌కప్ క్రికెట్ కౌన్సిల్(డబ్ల్యూసీసీ) యూకే చైర్మన్ డాక్టర్ హరి ఓమ్‌త్యాగీ, లండన్ మాజీ ఎంపీ పాల్ స్కలీలు, పార్లమెంట్ బృందం అనుహ్యా రెడ్డికి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా పేదలకు సేవలు అందించినందుకు ఈ గుర్తింపు దక్కిందన్నారు. 2014 నుంచి 'కోవిద సహృదయ ఫౌండేషన్' ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నిస్వార్థంగా సేవలందించినట్టు చెప్పారు. అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.



సమావేశంలో వివిధ శాఖల అధికారులు

బోనాల ఏర్పాట్లపై అధికారుల సమావేశం

యూసుఫ్‌గూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బోనాల ఏర్పాట్లపై యూసుఫ్‌గూడ సర్కిల్-19 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ సమక్షంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, ఆరోగ్య, స్ట్రీట్‌లైట్స్, పోలీస్ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆలయాల కమిటీల ప్రతినిధులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

'రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలి'

బేగంపేట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బఫర్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలని జీహెచ్ఎంసీ అధికారులకు ప్రైడ్ ఇండియా వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన యాజమానులు కోరారు. సోమవారం బేగంపేట మాతాజీనగర్ సమీపంలోని సర్వే నంబరు 194/8/1ఈలోని వెంచర్‌లో గల బాలాజీనగర్ ప్లాట్ రెసిడెంట్స్ సొసైటీ ప్రతినిధులు స్వామి, బేగ్, సలీం, ప్రకాశ్ తదితరులు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులను కలిసి బఫర్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలని వినతిపత్రం అందజేశారు. 8 సంవత్సరాల క్రితం ప్లాట్స్ కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు ఇళ్లను కూల్చివేశారన్నారు. కూల్చివేతలపై ప్రజాభవన్‌లో ప్రజావాణిలో సైతం వినతిపత్రం అందజేశామన్నారు. బఫర్ జోన్‌లో ఉన్న ఈ స్థలాన్ని రెసిడెన్షియల్ జోన్‌కు మార్చాలని సొసైటీ ప్రతినిధులు కోరారు.



సారథినగర్‌లో వివాదంలో ఉన్న స్థలం

వివాదంలో స్థలం.. తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు

ఎర్రగడ్డ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సారథి నగర్‌లో వివాదంలో ఉన్న స్థలం విషయంలో అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఎంఐఎం నాయకుడు మహమ్మద్ అజర్ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారథి సొసైటీ సర్వే నంబర్ 128లో ప్లాట్ నంబర్ 30 స్థల వివాదం కొంతకాలంగా జరుగుతుందన్నారు. అది ప్లాట్ నంబర్ 30 కాదని, 22 అని, దీనికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

యువకుడి అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యుకుడు కనిపించకుండాపోయాడు. సూరేపల్లి జయరాజ్ జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు అఖిల్(17) ఈనెల 22వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి జయరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అఖిల్‌కు సరిగా వినపడదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖుల ప్రాంతంలో

రోడ్లు అధ్వానం

25 సంవత్సరాలుగా కొత్తవి నిర్మించని అధికారులు

బంజారాహిల్స్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖులు ఉండే కాలనీ అది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రతి నిత్యంరాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఆ కాలనీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌రోడ్డు నంబరు 72 జర్నలిస్టు కాలనీకి ఆనుకొని ఉన్న అశ్వినీ లే అవుట్‌లో రోడ్లు పాడైపోయాయి. సమస్య తలెత్తినప్పుడల్లా 25 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లనే మరమ్మతులు చేస్తూ అధికారులు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ప్రస్తుతం వర్షాలకు రోడ్లు కొట్టుకుపోవడంతో రాళ్లు తేలాయి. ప్లాట్ నంబర్ 3 నుంచి 10 వరకు రోడ్డు కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. రోడ్లను నిర్మించాలని జీహెచ్ఎంసీ అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.





అశ్విని లే అవుట్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లు



ద్వారకా నగరాన్ని వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న షాహిద్ ఖాన్, కలదర్ వల్లం, రవీంద్రజిత్, క్రాంతికుమార్

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సముద్ర గర్భంలో ఉన్న పురాతన ద్వారకా నగరం ఒకప్పుడు ప్రపంచానికి రాజధానిగా ఉండేదంటూ తమ పరిశోధనలో తేలిందని ఇట్స్ సిక్స్ వావ్ సంస్థ అధ్యక్షురాలు షాహిద్ ఖాన్, తెలంగాణ చైర్మన్ కలదర్ వల్లం, ప్రధాన కార్యదర్శి రవీంద్రజిత్ తెలిపారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో ద్వారకా నగరాన్ని చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ప్రపంచ చరిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జై ద్వారక ప్రచారం బ్రోచర్, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ద్వారకా నగరం ప్రపంచానికి రాజధానిగా ఉండేదంటూ తమ పరిశోధన ఆధారాల వీడియోను వారు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలోకి ద్వారకాను చేర్చేందుకు తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ద్వారకా నగరాన్ని సంరక్షిస్తే మహాభారతానికి సంబంధించిన ఎన్నో కీలక ఆధారాలను బయటపెట్టవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సింధు నదీ లోయ, మెసపొటేమియా, పురాతన ఈజిప్ట్, చైనా, మినోయన్, ఓల్మెక్, నోర్టే చికో వంటి నాగరికతలకు సమకాలీనమైన పురాతన కాలంలో ద్వారకా ముఖ్యమైన రాజధాని నగరంగా ఉందని సూచించే ఆధారాలను వీడియోలో చూపించామని అన్నారు. ఘనమైన చరిత్ర ఉన్న ద్వారకాను భారతదేశ జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సముద్రంలో మునిగిపోయిన ద్వారకా నగరాన్ని వెలుగులోకి తీసుకురావడంతోపాటు, రక్షించి దాని చారిత్రక, పురాణాలకు సంబంధించిన ప్రాముఖ్యతను బయటపెట్టడమే లక్ష్యంగా తమ ప్రచారం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ సంయుక్త కార్యదర్శి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల్లో కోతపై పారిశుధ్య కార్మికుల ధర్నా



ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఖైరతాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కట్ చేసిన వేతనాన్ని వెంటనే ఖాతాల్లో జమచేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. సోమవారం ఖైరతాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయంలో బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జి.విఠల్, ఎం వెంకటేష్ మాట్లాడుతూ.. రెండు నెలలు నుంచి పారిశుధ్య కార్మికులు అన్ని రోజులూ పని చేసినా కొందరికి రూ. 2వేల నుంచి మూడు వేల రూపాయలు మాత్రమే వేతనం వచ్చిందన్నారు. మరికొందరికి రూ. 4 వేల నుంచి 5 వేల రూపాయల వేతనం కట్ చేశారని, కారణం మాత్రం చెప్పడం లేదన్నారు. ఖైరతాబాద్ జోన్‌లోని 12, 13, 18 సర్కిళ్లలో చాలా మందికి ఇలా జరిగిందన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అన్ని పనిముట్లు ఇవ్వాలని, అవినీతికి పాల్పడుతున్న ఎస్ఎఫ్ఏలను కఠినంగా శిక్షించాలని కోరారు. ధర్నాలో నాయకులు మల్లేష్, జీహెచ్ఎంసీ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి మందలించిందని కుమార్తె, ఓ మహిళ బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. భద్రాచలంకు చెందిన నామవరపు జ్యోత్స్నశ్రీ పదో తరగతి తెలుగు మీడియంలో చదువుకుంది. అనంతరం ఆమె తల్లి నాగమణి భద్రాచలం ప్రభుత్వ గురుగుకుల పాఠశాలలో బైపీసీ గ్రూప్ ఇంగ్లిష్ మీడియంలో చేర్పించింది. ఇంటర్ మొదటి సంవత్సరం అయిపోయిన తరువాత తనకు ఇంగ్లిష్ మీడియం అర్థం కావటంలేదంటూ చదువు మానేసి హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో ఉంటూ నిమ్స్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న పిన్ని స్వరూప వద్దకు వచ్చింది. నాలుగు రోజుల నుంచి అమీర్‌పేటలో ఓ షోరూమ్‌లో పనిచేస్తోంది. జ్యోత్స్నశ్రీ సరిగా పనిచేయకపోవడంతో యజమాని ఆమె తల్లి నాగమణికి ఫోన్ చేసి చెప్పింది. నాగమణి కుమార్తెకు ఫోన్ చేసి చదువు మానేశావు, పనికూడా సరిగా చేయకపోతే ఎలా అని మందలించింది. మనస్తాపం చెందిన జ్యోత్స్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. స్వరూప మధ్యాహ్నం 1.30 గంటలకు నిమ్స్‌లో విధులు ముగించుకొని ఇంటికిరాగా జ్యోత్స్న ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. స్వరూప ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రహ్మత్‌నగర్‌లో..

యూసుఫ్‌గూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివసిస్తున్న ఎస్. యాదగిరిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు ఈనెల 23వ తేదీన వాకింగ్ వెళ్లి వచ్చారు. వాషింగ్ మెషీన్ వచ్చిందని ఆ రోజు మధ్యాహ్నం యాదగిరిరెడ్డికి కోడలు ఫోన్ చేయగా ఐదో అంతస్తు నుంచి కిందికి వెళ్లాడు. దాన్ని తీసుకొని పైకి వెళ్లాడు. భార్య విజయలక్ష్మిని పిలవగా పలకలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించి మృతి చెందిందని తెలిపారు. ఆమె ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. యాదగిరిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి



నిరసన, ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్, గణేశ్‌నాయక్ తదితరులు

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదట ధర్నా చేయనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బంజారా, గణేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల నాయకులు పాండునాయక్, శ్రీనివాస్, సరోజబాయితో కలిసి ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఫిబ్రవరి 15న సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, పార్వతి, యాదమ్మ, లక్ష్మణ్ నాయక్, బన్సీలాల్‌నాయక్, సుధీర్‌నాయక్, మురళి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో రూ.498 కోట్లతో జీఐఎస్ సబ్‌స్టేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విస్తరణ.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కోకాపేటలో 220/132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్(జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.498 కోట్లతో పరిపాలన అనుమతినిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. 2023 ఏప్రిల్ 6న రూ. 519.77 కోట్ల అంచనా వ్యయంతో గతంలో ఉత్తర్వులు ఇవ్వగా, దాన్ని తాజాగా సవరించారు. అంచనా వ్యయం సుమారు రూ. 20 కోట్లు తగ్గించారు. కోకాపేట ఉపకేంద్రం నిర్మాణానికి రూ. 171.85 కోట్లు, కేతిరెడ్డిపల్లి- శంకర్‌పల్లి 220కేవీ నుంచి కోకాపేట వరకు 14 కిలోమీటర్ల దూరం ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను మోనోపోల్స్‌తో నిర్మించేందుకు రూ. 136.03 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

గచ్చిబౌలి- రాయదుర్గం 220 కేవీ నుంచి 10.5 కిలోమీటర్లు కోకాపేట వరకు మోనోపోల్స్‌తో ఓవర్‌హెడ్‌లైన్లు వేసేందుకు రూ. 109.55 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు.



విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం

పేద విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాల పంపిణీ

ఖైరతాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తండ్రి పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి 21 సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్న మహేష్ యాదవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా సోమవారం 500 మంది పేద విద్యార్థులకు ఎమ్మెల్యే దానం చేతుల మీదుగా ఖైరతాబాద్ గణపతి వేదిక వద్ద ఉచితంగా బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తన తరఫున ఖైరతాబాద్‌లో 3 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా బూట్లు అందజేస్తానని దానం హామీ ఇచ్చారు. ట్రస్టు చైర్మన్ మహేష్ యాదవ్ మాట్లాడుతూ.. సంపాదించిన దాంట్లో కొంత సమాజ కార్యానికి వినియోగిస్తే ఎంతో తృప్తి కలుగుతుందని, ఆ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ హేమలత యాదవ్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్, నవీన్‌యాదవ్, బాక్సర్ అశోక్ తదతరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి



బాధ్యతలు స్వీకరిస్తున్న అనురాగ్ జయంతి

ఖైరతాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. పోస్టింగ్‌లు విడుదలైన గంటల వ్యవధిలోనే వెయిటింగ్‌లో ఉన్న ఆయన ఖైరతాబాద్ జోనల్ కార్యాలయానికి వచ్చారు. అనురాగ్ జయంతి 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. అంతకు ముందు రాజన్న సిరిసిల్ల జిల్లా, ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

రూ. 30 లక్షలతో కమ్యూనిటీ హాలు



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభించి అధికారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బీజేఆర్ నగర్‌లో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయారెడ్డి సోమవారం ప్రారంభించారు. అందరూ వినియోగించుకునే విధంగా కమ్యూనిటీ హాలును సిద్ధం చేయాలని ఆమె అధికారులను కోరారు.

'సొసైటీ సభ్యత్వాలను ప్రక్షాళన చేయాలి'

ఎర్రగడ్డ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభ్యులు తీర్మానించారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మెంబర్‌షిప్ ప్రక్షాళన జరిగిన తర్వాత ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సొసైటీ సభ్యులు కె. తులసీదాస్, ఎల్. పాండురంగారెడ్డి, ఎన్. అంజిరెడ్డి, రాజగోపాల్, డాక్టర్ కెహెచ్ఎస్. శర్మ, కొల్లప్ప, ఐవి. రాజు, డీకే గోపాల్‌రావు, బి. శ్యాంప్రసాద్, ఎస్.వి. చిన్నకృష్ణ, గూడూరి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

● కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి తీర్మానం



బ్రిగేడియర్ సోమశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ

సికింద్రాబాద్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పునః ప్రారంభించాలని ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి తీర్మానించింది. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండర్, కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ అధ్యక్షతన సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశం జరిగింది. కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, ఎక్స్‌అఫీషియో సభ్యుడు (కంటోన్మెంట్ శాసనసభ్యుడు) ఎన్.శ్రీగణేష్ పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉప ఎన్నిక కూడా పూర్తయి ఫలితాలు వెలువడడంతో ఎన్నికల కోడ్ ముగిసిందని, ఇక పూర్తి స్థాయిలో కంటోన్మెంట్ అభివృద్ధిపై దృష్టిసారించాలని సమావేశంలో తీర్మానించారు. కోట్లాది రూపాయల వ్యయంతో రూపొందించిన రోడ్లు, డ్రైనేజీ, భవనాల నిర్మాణం, నిర్వహణ, మరమ్మతులను తక్షణమే ప్రారంభించాలని తీర్మానించారు.

● 2016-18వ సంవత్సర కాలంలో జీహెచ్ఎంసీతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో జైకా నిధులతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టారు. అయితే సౌజన్య కాలనీ, తాడ్‌బండ్, మస్తానా హోటల్, పికెట్ ఈ నాలుగు పాయింట్ల వద్ద వివిధ కారణాలతో పైప్‌లైన్లను అనుసంధానం చేయలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన ఈ పైప్‌లైన్లను అనుసంధానం చేయడం ద్వారా పలు ప్రాంతాలను వరద ముంపు నుంచి రక్షించవచ్చని, అందుకే తక్షణమే దీనిపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

● తిరుమలగిరి చెరువు శుద్ధి, సుందరీకరణ పనుల కోసం మెట్రో వాటర్ బోర్డుకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు 45 లక్షలు చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు 2కోట్ల 90లక్షల రూపాయిలు రావాల్సి ఉంది. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తుచేసి, చెరువు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.

● దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల కారుణ్య నియామకాల ప్రక్రియ చేపట్టాలని, దీనికిగాను ఉన్నతాధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. నిబంధనల ప్రకారం 22 కారుణ్య నియామకాలు చేయవలసి ఉందని సీఈఓ మధుకర్ నాయక్ వెల్లడించారు.

● వీధి శునకాల నుంచి పౌరులను రక్షించడానికిగాను శునకాలకు వ్యాక్సినేషన్ ఇతర పనులను రెడ్ క్రాస్ సొసైటీ సంస్థకు అప్పగించాలని చర్చించారు.

● 2వ వార్డులోని ఇందిరమ్మనగర్ తదితర ప్రాంతాల్లో చాలా ఏళ్లుగా డ్రైనేజీ సమస్య అపరిష్కృతంగా ఉన్నందున, వీటి పరిష్కారానికిగాను నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు.

● తిరుమలగిరిలోని మహాత్మానగర్ కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం, ఈ ప్రాంగణంలోని చెత్త డంపింగ్ యార్డు తొలగింపుపై కొద్దిసేపు చర్చ జరిగింది. తక్షణమే కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణం చేయాల్సి ఉందని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు తీసుకువస్తానని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ కోరారు. దీనిపై జె.రామకృష్ణ సైతం కల్పించుకుంటూ జీహెచ్ఎంసీలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అతి పెద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగిందని, శ్రీగణేష్ ద్వారా అదనపు నిధులు తెప్పించుకుని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాలు స్థానంలో అతి పెద్ద కమ్యూనిటీ హాలును నిర్మాణంలోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు. అయితే, ఇక్కడ చెత్త డంపింగ్‌ను ఎత్తివేయాలంటే ప్రత్యామ్నాయాలు చూపవలసి ఉంటుందని బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్ స్పష్టం చేశారు. ఒక్కో వార్డులో ఒక్కొక్కటి చొప్పున 8 వార్డుల్లో మొత్తం 8 చిన్నపాటి ట్రాన్సిట్ పాయింట్లు చూపించగలిగితే మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్ ప్రాంగణం నుంచి చెత్త డంపింగ్ యార్డును తొలగించవచ్చని స్పష్టం చేశారు.

● బొల్లారంలోని కంటోన్మెంట్ కేంద్ర ఆస్పత్రి నిర్వహణపై ఆసక్తికర చర్చ జరిగింది. ఈ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి, సదుపాయాలను మెరుగుపరచడం వలన కంటోన్మెంట్‌వాసులతోపాటు ఇతర జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని జె.రామకృష్ణ అభిప్రాయపడ్డారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కాగా ఈ ఆస్పత్రికి గతంలో రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో నిధులు తీసుకువచ్చారని, ఆస్పత్రి నిర్వహణపై ఆయనకు పూర్తి అవగాహన ఉన్నదని, కాబట్టి ముఖ్యమంత్రి నుంచి సానుకూలత రావచ్చని మధుకర్ నాయక్ చెప్పారు. ఈ అంశాన్ని తాను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని శ్రీగణేష్ పేర్కొన్నారు.


ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బద్దం బల్వంత్‌రెడ్డి

బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

● బద్దం బల్వంత్‌రెడ్డి

బోయిన్‌పల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బోయిన్‌పల్లి వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవిని తనకు కేటాయించాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బద్దం బల్వంత్‌రెడ్డి సోమవారం స్థానిక కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం సమర్పించి విన్నవించుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1995 నుంచి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నానని, కాంగ్రెస్ పార్టీ తరపున టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పనిచేస్తున్నట్లు, కంటోన్మెంట్ ప్రాంతంలో ఎందరో నాయకులు పార్టీ మారినా తాను పార్టీ మారకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కోరినట్లు తెలిపారు.

అన్ని ఆలయాలకు న్యాయం జరగాలి

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్



బోయిన్‌పల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం జరగనున్న బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్ల నిధులను మంజూరు చేయడం సంతోషకరమని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు జరుగకుండా అన్ని దేవాలయాలకు న్యాయం జరిగేలా, ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని దేవాలయాలకు న్యాయం జరిగేలా స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక చొరవ చూపాలని జంపన ప్రతాప్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం గాయత్రి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జంపనప్రతాప్ మాట్లాడుతూ నిధుల కేటాయింపులో ఇతర నియోజకవర్గాలకు ఇచ్చిన మాదిరిగానే కంటోన్మెంట్‌కు సైతం అదే విధంగా నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం అలా జరుగకుండా ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

వ్యక్తి అదృశ్యం


మహ్మద్ ఫయాజ్

అడ్డగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్ళిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నార్త్‌లాలాగూడ జామైమజీద్‌కు చెందిన మహ్మద్ ఫయాజ్ (37)కు ఈమధ్యనే పెళ్లి సంబంధం కుదిరింది. గతనెల 30న స్నేహితులను కలిసి వస్తానన్న ఫయాజ్ ఆరోజు రాత్రి వరకు ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఇరవై రోజుల వరకు వేచి చూసి చివరికి గత్యంతరం లేక కుటుంబ సభ్యులు లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే లాలాగూడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోకాపేటలో రూ.498 కోట్లతో జీఐఎస్ సబ్‌స్టేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విస్తరణ.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కోకాపేటలో 220/132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ (జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.498 కోట్లతో సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతులిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ సోమవారం ఉత్తర్వు జారీచేశారు. 2023 ఏప్రిల్ 6న రూ.519.77కోట్ల అంచనా వ్యయంతో గతంలో ఉత్తర్వులు ఇవ్వగా, దాన్ని తాజాగా సవరించారు. అంచనా వ్యయం సుమారు రూ.20కోట్లు తగ్గించారు. కోకాపేట ఉపకేంద్రం నిర్మాణానికి రూ.171.85 కోట్లు, కేతిరెడ్డిపల్లి-శంకర్‌పల్లి 220కేవీ నుంచి కోకాపేట వరకు 14కిలోమీటర్ల దూరం ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను మోనోపోల్స్‌తో నిర్మించేందుకు రూ.136.03కోట్లు అవుతుందని అంచనా వేశారు. గచ్చిబౌలి-రాయదుర్గం 220కేవీ నుంచి 10.5కిలోమీటర్లు కోకాపేట వరకు మోనోపోల్స్‌తో ఓవర్ హెడ్‌లైన్లు వేసేందుకు రూ.109.55కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు.

వలభ్‌నగర్ సబ్‌రిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలి

అల్వాల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): అల్వాల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం లేకపోవడంతో వల్లభ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సివస్తుంది. అక్కడికి వెళ్లాలంటే ప్రజలకు ఇబ్బందిగా మారిందని, అల్వాల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని సోమవారం మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దండుగుల వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు డీసీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. వల్లబ్‌నగర్ 13 కిలోమీటర్ల దూరం ఉండటంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రజలు వ్యయప్రయాసాలకుగురవుతున్నారని వెంకటేష్ పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు మల్లిఖార్జున్‌గౌడ్, సుజాత, పద్మిని ఉన్నారు.


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

చిలకలగూడ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ అమర్ టాకీస్ వద్ద డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు చేపడతానని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. డ్రైనేజీ నీరు పొంగి రోడ్లపైకి రావడంతో స్థానికులు సోమవారం కార్పొరేటర్‌కి ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి శాశ్వత పైపులైన్ వేసి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.


నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు ఓయూలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు

ఓయూలో విద్యార్థుల ఆమరణ నిరాహార దీక్ష

● దీక్ష చేపట్టిన విద్యార్థులను అరెస్టు చేసిన పోలీసులు

తార్నాక, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా నిరుద్యోగ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఓయూ జేఏసీ విద్యార్థి నాయకుడు మోతీలాల్ నాయక్ అన్నారు. నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు సోమవారం నిరుద్యోగ విద్యార్థులతో కలిసి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆమరణ దీక్ష చేస్తున్న విద్యార్థులను ఓయూ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించడంతోపాటు, గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని, నిరుద్యోగ భృతి రూ.4000లు చెల్లించాలని, ఆర్టీసీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించేవరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు.


పద్మారావునగర్‌లోని ఎస్పీ కళాశాలలో యోగా సాధనలో విద్యార్థులు

ఎస్‌పీ కళాశాలలో యోగా దినోత్సవం

పద్మారావునగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి పద్మారావునగర్‌లోని ఎస్పీ కళాశాలలో సోమవారం యోగాదినోత్సవ వేడుకలను జరుపుకొన్నారు. సర్దార్‌పటేల్ కళాశాల, సంస్కృతి ఫౌండేషన్ సంస్థ సంయుక్తంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా యోగా గురువు రాజశేఖరరెడ్డి విద్యార్థులకు యోగా సాధన ద్వారా కలిగే ప్రయోజనాలను విపులంగా తెలియజేశారు. ప్రతీరోజు యోగా సాధన చేయడం ద్వారా తీవ్రమైన ఒత్తిడి నుంచి నివారణ పొందడంతోపాటుగా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్.హేమలత, ఫౌండేషన్ ప్రతినిధులు క్షీరసాగర్, సుహాసిని, పరిపాలనా అధికారి రాహుల్ యాదవ్, అధ్యాపకులు అమర్‌సింగ్, సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో లక్ష పుష్పార్చన

రెజిమెంటల్‌బజార్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన ఘనంగా జరిగింది. సోమవారం అష్టాదశ వార్షికోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ప్రాతఃకాల పూజలు, మూలమంత్ర అనుష్టానములు, ఆవాహిత మంటప దేవతా హోమాలు, వేదపారాయణం, చండీహోమం, లక్షపుష్పార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో విఠలయ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, గున్నాల ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లను సురక్షితంగా నడపాలి

● రాకపోకలపై ఇబ్బందులు తలెత్తరాదు
● దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

హైదరాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రైళ్లను సురక్షితంగా నడుపాలి.. వాటి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైలు కార్యకలాపాల భద్రతపై సమీక్ష నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులుతో కలిసి వివిధ శాఖాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యారు. రైళ్లను సురక్షితంగా నడపడానికి సంబంధించిన భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, పాయింట్ మెన్,స్టేషన్ మాస్టర్లు, ఇతర సిబ్బందికి ఆచరణాత్మకంగా కౌన్సెలింగ్ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అసాధారణ సంఘటనలు జరగకుండా ఉత్తమ విధానాలను అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. అనుకోని సంఘటన ఉత్పన్నమైతే సంబంధిత అన్ని విభాగాల సమన్వయంతో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రధాన రైల్వే యార్డ్‌లలో సీసీటీవీ పర్యవేక్షణ ఏర్పాటు చేసి అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అరికట్టేందుకు, రైల్వే ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాక్ నిర్వహణకు సంబంధించిన పనులు చేపట్టే ముందు తగు భద్రతా చర్యలు పాటించాలనున్నారు. పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాల నిల్వ స్థితిని సమీక్షించారు. సరిపడే అగ్నిమాపక నివారణ పరికరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి తగిన విశ్రాంతి కల్పించేందుకు డివిజనల్ రైల్వే మేనేజర్లు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జోన్ పరిధిలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశానికి సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు పాల్గొన్నారు.


నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రొ.గాలి వినోద్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగ విద్యార్థి నాయకులు

తెలంగాణ ప్రభుత్వం గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలి

● ప్రొ.గాలి వినోద్‌కుమార్

తార్నాక, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీతోపాటు, గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ అన్నారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ నిరుద్యోగ విద్యార్థి నాయకులు సోమవారం ప్రొ. గాలి వినోద్‌కుమార్‌ను తార్నాకలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిప్రతం ఇచ్చారు. ఈ సందర్భంగా గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, అదేవిధంగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించి ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలని కోరారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో విద్యార్థులకు ఏవిధంగా అండగా నిలబడటం జరిగిందో, అదేవిధంగా నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు విద్యార్థులపక్షాన ఉద్యమిస్తానని నిరుద్యోగులుకు హామీ ఇచ్చారు.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయం వద్ద 17మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపడుచుల పెళ్లికి చేయూత అందించి అండగా నిలవాలనే ఆలోచనతో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్‌లక్ష్మి, మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, నాయకులు బాల్‌రెడ్డి, అశోక్ యాదవ్, పి.శంకర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆషాడమాస బోనాల సమావేశానికి ఆహ్వానం

ఆషాడమాస బోనాల ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఈనెల 26వ తేదీన జరిగే సమావేశానికి హాజరు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వానించారు. సికింద్రాబాద్‌లోని శ్రీఉజ్జయినీ మహాకాళి ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని నివాసంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఈమేరకు ఆహ్వానాన్ని అందజేశారు.


కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి

బౌద్ధనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్, సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని కార్పొరేటర్ సామల హేమ కలెక్టర్ అనుదీప్‌ను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అనుదీప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ సంఘంవారికి ఇచ్చిన హామీ మేరకు బాబు జగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ చొరవ తీసుకుని ప్రతిష్ఠించటానికి అనుమతి కోరుతూ, ప్రతిష్ఠాపన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను కోరామని కార్పొరేటర్ తెలిపారు. సికింద్రాబాద్ శాసనసభ్యుడు పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, విగ్రహాల ప్రతిష్ఠ తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి బాబురావు, రవీంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన, ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్ తదితరులు

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని 28న సీఎం ఇంటి ఎదుట ధర్నా

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేయనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల నాయకులు పాండునాయక్, శ్రీనివాస్, సరోజబాయితో కలిసి వారు ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఫిబ్రవరి 15న సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, పార్వతి, యాదమ్మ, లక్ష్మణ్ నాయక్, బన్సీలాల్‌నాయక్, సుధీర్‌నాయక్, మురళినాయక్, తదితరులు పాల్గొన్నారు.

అల్లరిమూకలపై ఉక్కుపాదం

● పోకిరీలు రోడ్డుపై కనిపిస్తే చర్యలు
● బోయిన్‌పల్లిలోని పలు ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు
● రాత్రి 10:30 లోపు దుకాణాలు మూసివేయాలి... లేదంటే కేసులు తప్పవు


బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బోయిన్‌పల్లి, జూన్ 24(ఆంధ్రజ్యోతి): నగరంలో అరాచకాలు సృష్టిస్తున్న పోకిరీలు, ఆకతాయిలు, అల్లరిమూకలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ సిబ్బందిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నగరంలోని పోలీస్‌స్టేషన్‌లకు, పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెంటర్‌పాయింట్, డైమండ్ పాయింట్, బాపూజీనగర్, మహాత్మానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలలో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రెండురోజులుగా తనిఖీలు నిర్వహిస్తూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి జరిపిన తనిఖీలలో ఎలాంటి పత్రాలు లేకుండా, నెంబర్ ప్లేట్ లేకుండా, తప్పుడు నెంబర్ ప్లేట్‌లను అమర్చుకుని తిరుగుతున్న పోకిరీలు, ఆకతాయిలకు చెందిన 2 కార్లు, 13 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి, సదరు వ్యక్తులపై కేసులు నమోదుచేసినట్లు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, రోడ్డుపై అల్లర్లు సృష్టించినా గుంపులుగా తిరుగుతూ గొడవలు చేస్తున్నవారిని ఉపేక్షించేదిలేదని, అరాచక శక్తులు అల్లరిమూకలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఇలాంటి వారికోసం ఫోన్‌లు చేయడం, వారికోసం సిఫారసులు చేయడం మంచిదికాదని, ప్రజల శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. సీపీ ఆదేశాలతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మద్యం, గంజాయి మత్తులో అర్ధరాత్రి రోడ్లపైన తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీమూకలను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి పోలీస్ సిబ్బందితో పాటు ఎస్ఐ యు.నాగేంద్రబాబు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలు సృష్టిస్తున్న పోకిరీల పనిపడతాం.. అల్లరిమూకలపై ఉక్కుపాదం మోపుతామని, పోకిరీలు రాత్రి సమయాలలో రోడ్లపైన కనిపిస్తే చర్యలు తప్పవని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి హెచ్చరించారు.